క్లుప్తంగా

తైక్వాండో పోటీల్లో సిక్కోలు జోరు



క్రీడాకారులను, సంఘ ప్రతినిధులను అభినందిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు సత్తాచాటారు. అనకాపల్లి వేదికగా జనవరి 29 నుంచి 31వ తేదీ వరకు జరిగిన ఏపీ రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా తైక్వాండో అసోసియేషన్ తరఫున ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు 11 పతకాలు సాధించారు. జూనియర్ బాలురు విభాగంలో డి.హరిష్ కుమార్, క్యాడెట్ బాలురు విభాగంలో డి.శ్రీకర్, క్యాడెట్ బాలికల విభాగంలో వి.జాహ్నవి, సాయి కిరణ్మయి, జూనియర్ పూమ్సే విభాగంలో వి.జగదీశ్వరరావులు రజత పతకాలు సాధించారు. సీనియర్ పురుషుల విభాగంలో గొర్లె గణసాయినాయుడు, మోర్త సాయిబాలాజీ, జూనియర్ బాలురు విభాగంలో వందన జగదీశ్వరరావు, జూనియర్ బాలికల విభాగంలో షమ్రీన్, క్యాడెట్ బాలికల విభాగంలో రోసీ షారోన్, ఎస్.నవ్య, పూమ్సే విభాగంలో జి.దయాశంకర్ రెడ్డి కాంస్య పతకాలు సాధించారు. వీరిని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, పారిశ్రామిక వేత్త బలగ ప్రకాష్ తదితరులు అభినందించారు.

పిల్లలకు వ్యాక్సినేషన్ తప్పనిసరి

లావేరు: పిల్లలకు తప్పనిసరిగా వ్యాక్సినేషన్ చేయించాలని లావేరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ మణిభూషణ్ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో బుధవారం పిల్లలకు వ్యాక్సినేషన్ వేసే కార్యక్రమం చేపట్టగా మణిభూషణ్ పర్యవేక్షించారు. పిల్లలకు పోలియో, చికెన్ పాక్స్, తట్టు, కలరా, పచ్చకామెర్లు వంటి వ్యాధులు రాకుండా ఉండటం కోసం ప్రభుత్వం ఉచితంగా వ్యాక్సిన్ వేయిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోతయ్యవలసలో వైద్య శిబిరం

లావేరు: పోతయ్యవలస గ్రామంలో 104 వాహన వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన పోతయ్యవలస పంచాయతీ సర్పంచ్ కొంపెల్ల అప్పన్న మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లావేరు పీహెచ్‌సీ వైద్యురాలు మణిభూషన్, 104 వైద్య సిబ్బంది శిబిరానికి వచ్చిన వారికి ఉచితంగా తనిఖీలు నిర్వహించి మందులు అందజేశారు. ఆరోగ్యపై రోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సుహాసిని, ఎంఎల్‌హెచ్‌పీ స్వర్ణలత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ చిన్నారులకు అన్నప్రాశనం

లావేరు: మురపాకలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు బుధవారం అన్నప్రాశన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పెయ్యల నాగమణి, సచివాలయం ఎంఎస్‌కే రజనీశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లలకు అన్నప్రాశనం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగమణి మాట్లాడుతూ.. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా నిర్లక్ష్యం చేయరాదన్నారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఉచితంగా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాలసంస్కార్ కేంద్రం ఏర్పాటు

గార: దీపావళి గ్రామంలోని ధర్మశాస్త్ర జ్ఞానాశ్రమంలో భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని బాలసంస్కార్ కేంద్రాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. జ్ఞానాశ్రమం నిర్వాహకులు, విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి శ్రీరంగం మధుసూదనరావు ఆధ్వర్యంలో మైలపల్లి రాంబాబు గురుస్వామి మార్గదర్శనంలో లక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్రం, విష్ణు సహస్ర నామపారాయణం, లలితా పారాయణం చిన్నారులచే చేయించారు. ప్రతీ ఆదివారం కేంద్రంలో పారాయణం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

అనాథలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): తెలగ సంక్షేమ సంఘం నాయకుడు ద్వారపు అజిత్ పుట్టిన రోజు సందర్భంగా నిరుపేద మానసిక దివ్యాంగులు, అనాథలకు బుధవారం అన్నదానం చేశారు. శ్రీకాకుళం నగరంలోని బెహరా మనోవికాస కేంద్రంలో పిల్లలకు స్వీట్లు, ఆహారం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలగ కుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న అజిత్ మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎల్.బి.ఎస్.కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రామకృష్ణ, సిద్ధ జగదీష్, కాసిన సూర్యప్రసాద్, బరాటం లక్ష్మణ్‌రావు, సింతు సుధాకర్, తంగి శివ, శెట్టి ఉషారాణి, చింతలపూడి ప్రసాద్, రొక్కం శేషు, రొక్కం వెంకటేశ్వరరావు, బురవిల్లి మురళి, కూదిరెల్ల అప్పారావు పాల్గొన్నారు.

భక్త జనధార

- ఘనంగా శాలిహుండం జాతర
- సంతాన వేణుగోపాలుడ్ని దర్శించుకున్న భక్తులు
- వంశధార నదిలో స్వామి చక్రతీర్థ స్నానం
- పటిష్ట బందోబస్తుతో యాత్ర విజయవంతం

గార: వంశధార తీరం జనసంద్రమైంది. మాఘశుద్ధ ఏకాదశి (భీష్మ ఏకాదశి)ని పురస్కరించుకొని కాళీయ మర్దన వేణుగోపాల స్వామి (శాలిహుండం) యాత్ర శోభాయామానంగా జరిగింది. ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో శ్వేతగిరి కిటకిటలాడింది. బుధవారం అర్ధరాత్రి తర్వాత స్వామికి క్షీరాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సుగ్గు మధురెడ్డి దంపతులు స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ట్రస్టీ దర్శన అనంతరం భక్తులు స్వామిని దర్శించుకున్నారు. దూర ప్రాంతాల నుంచి ముందురోజు రాత్రికి చేరుకున్న భక్తులు బోరవానిపేట, శాలిహుండం, పూసర్లపాడు గ్రామాల్లో విడిదులు ఏర్పాటు చేసుకొని వ్రతాలు చేశారు. దాసురాళ్లు, దాసుళ్ల స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రంతా దాసుళ్ల పూజలతో పాటు తప్పెటగుళ్లు, దాసుపాటలు భక్తులను అలరించాయి. శ్వేతగిరిపై ఉన్న పంచక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు స్వామి దర్శనానంతరం మార్గమధ్యలో వీరవసంతేశ్వరుడు, కొండ దిగువన ఉన్న వెంకటేశ్వరస్వామి, గోవిందరాజస్వామి, నరసింహస్వామిలను దర్శించుకున్నారు. భారీగా వచ్చిన భక్తులతో కొండపైకి వెళ్లే రహదారులన్నీ నిండిపోయాయి. కొంతమంది అడ్డదారిలో కొండమీదికి ఎక్కేందుకు..దిగేందుకు సాహసించారు. ఎంపీపీ గొండు రఘురామ్, శ్రీకాకుళం ఏఎంసీ చైర్మన్ మూకాళ్ల తాతబాబు, వైస్ ఎంపీపీ అరవల రామకృష్ణ, పల్లి నర్సింహులు, సర్పంచ్‌లు కొయ్యాన నాగభూషణం, యాళ్ల నారాయణమూర్తి, కొంక్యాణ ఆదినారాయణ, జిల్లా ఎస్పీ జి.ఆర్ రాధిక దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు.



స్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ట్రస్టీ సుగ్గు మధురెడ్డి

వంశధార నదిలో చక్రతీర్థ స్నానం

యాత్ర సందర్భంగా విశేషమైన స్వామి చక్రతీర్థ స్నానం భక్తి శ్రద్ధలతో బుధవారం ఉదయం నిర్వహించారు. అర్చకులు స్వామి ఉత్సవమూర్తులైన రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలుడుతో పాటు లక్ష్మీనరసింహస్వామిని రెండు పల్లకిల్లో ఉంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని రోప్ పార్టీల సహాయంతో వంశధార నదికి తీసుకువచ్చారు. ఉదయం నుంచి స్వామి రాక కోసం ఎదురు చూస్తున్న వేలాదిమంది భక్తులు స్వామివారికి చక్ర తీర్థ స్నానం పూర్తి చేశారు. దీంతో భక్తులు పవిత్ర స్నానాలు చేశారు. డీఎస్పీ మహేంద్ర, సీఐ ఎల్.సన్యాసినాయుడు పర్యవేక్షణలో ఎస్సై ఎం.మధుసూదనరావు ఆధ్వర్యంలో రోప్ పార్టీల ద్వారా పటిష్ట బందోబస్తు నిర్వహించారు.



పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి



చక్రతీర్థ స్నానానికి పల్లకీల్లో తరలివెళ్తున్న ఉత్సవ మూర్తులు

గార: శాలిహుండం జాతరకు విచ్చేసిన భక్తులకు పలుగ్రామాల వద్ద అన్నదానాలు, మంచినీరు వంటివి స్థానికులు పంపిణీ చేశారు. బోరవానిపేట సత్యసాయి భక్తుల ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. పూసర్లపాడు తోట వద్ద పది వేల మందికి అన్నదానం చేశారు. వైస్ ఎంపీపీ అరవల రామకృష్ణ పాల్గొన్నారు. సతివాడ శివాలయం వద్ద స్థానికులు మూడు వేల మందికి అన్నదానం జరిపారు. శాలిహుండం గ్రామంలో కూడా అన్నదానం చేపట్టారు. యాత్ర పరిస్థితులను డీఎస్పీ మహేంద్ర, సీఐ ఎల్.సన్యాసినాయుడులు పర్యవేక్షించారు.

ముగిసిన మహాలక్ష్మి తల్లి జాతర

రణస్థలం: కమ్మసిగడాంలోని మహాలక్ష్మి తల్లి జాతర మూడో రోజైన బుధవారం రాత్రితో ముగిసింది. చివరి రోజున భక్తులు భారీగా తరలివచ్చారు. చీరలు, పసుపు–కుంకుమతో పాటు గాజులు, ప్రసాదాలు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల ఆటలు, జెయింట్ వీల్స్, జంతు ప్రదర్శనశాలలు, హ్యాండ్‌లూమ్స్ దుకాణాలు భక్తులతో కిటకిటలాడాయి. బాణసంచా కాల్పుల వెలుగులో జాతర ప్రాంతం మెరిసిపోయింది. పోలీసుల పగడ్బందీ బందోబస్తు ఏర్పాట్లతో ప్రశాంతంగా జరిగింది. జె.ఆర్.పురం సీఐ ఎస్.ఆదాం పర్యవేక్షణలో లావేరు, పొందూరు, ఎచ్చెర్ల, జె.ఆర్.పురం ఎస్సైలతోపాటు, జిల్లాలోని ఇతర పోలీసుస్టేషన్ల నుంచి వచ్చిన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



వినోద కార్యక్రమాల వద్ద రద్దీగా ఉన్న జనం

ప్రజా మద్దతుతో మళ్లీ గెలుద్దాం

- ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: ప్రజలకు మరింత చేరువై వారి మద్దతుతో 2024 ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరే సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు పని చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. పాలఖండ్యాం గ్రామ సమీపంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. టీడీపీ నాయకులు లేనిపోని ప్రచారాలు చేస్తున్నారని.. వాటిని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తిప్పికొట్టాలన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. దీనికి నిదర్శనం గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి అర్హులందరికీ సంక్షేమ పథకాలతోపాటు మౌలిక సదుపాయాలను కల్పించారన్నారు. 75 ఏళ్ల క్రితం గాంధీజీ కలలు కన్న స్వరాజ్యాన్ని ఇప్పుడు చూస్తున్నామన్నారు. ఇటువంటి గ్రామ స్వరాజ్యాన్ని కొన్ని మీడియా సంస్థలు ప్రజలకు చూపకుండా అసత్యాలు ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. జగనన్న పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. 2014 ఎన్నికలో చంద్రబాబు ప్రజలకు 600 హామీలు ఇచ్చిన ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. సమావేశంలో ఎచ్చెర్ల నియోజకవర్గ పార్టీ పరిశీలికుడు ఎన్.నాయుడుబాబు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, మండల సచివాలయ, గృహసారథుల కన్వీనర్ డోల వెంకటరమణ, వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏర్నేన ప్రకాశరావు, పార్టీ నాయకులు బూరాడ వెంకటరమణ, పేడాడ శ్రీరామమూర్తి, బత్తుల సన్యాసిరావు, పిల్లల శివకుమార్, మామిడి బలరాం, సర్పంచులు సాకేటి నాగరాజు, చిత్తిరి మోహన్, బుడారి లక్ష్మణరావు, వడిశ మహేశ్వరరావు, దారభోయిన వెంకటఅప్పారావు, గేదెల మల్లి బాబు, డకర కృష్ణ, రామకృష్ణ, పున్నాన అక్కలనాయుడు, ఎంపీటీసీ సభ్యులు గేదెల నారాయణరావు, మక్క శ్రీనివాసరావు టంకాల సత్యన్నారాయణ పాల్గొన్నారు.



జి.సిగడాం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

బాధ్యతతో పనిచేయాలి

లావేరు: సచివాలయాల కన్వీనర్లు, జగనన్న గృహసారథులు బాధ్యతతో పనిచేయాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు నెక్కల నాయుడుబాబు అన్నారు. కొత్తకుంకాం, గుర్రాలపాలెం, అదపాక, కొత్తకోట, గోవిందపురం, వెంకటాపురం, లావేరు–2, పెదలింగాలవలస, లావేరు–1, గురుగుబిల్లి సచివాయాల కన్వీనర్లు, ఆయా సచివాలయాల పరిధిలో నియమించిన గృహసారథులకు అదపాక గ్రామంలో శిక్షణ కార్యక్రమం, అవగాహన సదస్సు జరిగింది. సచివాలయాల కన్వీనర్లకు కిట్లను అందజేశారు. సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు గ్రామాల్లో పార్టీ పటిష్టత కోసం ఎలా పనిచేయాలో కిరణ్‌కుమార్, నాయుడుబాబు వివరించారు. అనంతరం మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అమలు జరిగిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలకు కన్వీనర్లు, ప్రతి వలంటీరుకు ఇద్దరు జగనన్న గృహసారథులను నియమించినట్టు వివరించారు. సీఎం ఆశయాలకు అనుగుణంగా మీరంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు షేక్‌చాన్‌బాషా, సచివాలయాల, గృహసారథుల మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు గొర్లె అప్పలనాయుడు, అదపాక ఎంపీటీసీ సభ్యుడు, సర్పంచ్ గంట్యాడ సత్యం, గొర్లె శశికళ, పలుపంచాతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



లావేరు: సచివాలయాల కన్వీనర్లకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్, పరిశీలకుడు నాయుడుబాబు

నిద్దాలమ్మకు ఎమ్మెల్యే పూజలు

జి.సిగడాం: నిద్దాం గ్రామంలో వెలసిన నిద్దాలమ్మ అమ్మవారిని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలికుడు ఎన్.నాయుడుబాబు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారివెంట మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, వైస్ ఎంపీపీ మీసాల సాధ్వీమణి, సహకర సంఘం చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు, పార్టీ నాయకులు మీసాల రాంబాబు, మాడుగుల మురళీధర్‌బాబా, ఏర్నేన శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.



జి.సిగడాం: అమ్మవారిని దర్శించుకుంటున్న కిరణ్‌కుమార్ తదితరులు

విజయవంతంగా 'ఫ్యామిలీ డాక్టర్'



సమావేశంలో మాట్లాడుతున్న చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఎంపీపీ, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మొదలవలస చిరంజీవి అన్నారు. పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నిరంతరం వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, కరోనా పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కుక్క, పాము కాటు వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఆస్పత్రిలో ప్రసవాలు జరిగేలా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి వారిని ప్రోత్సహించాలని చెప్పారు. సమావేశంలో డాక్టర్లు బి.శేషగిరి, దీపికా, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో కుమార్ పటా్నయక్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు బొడ్డేపల్లి సుధాకర్‌రావు, సర్పంచ్‌లు నేతింటి యమున, బొడ్డేపల్లి సుధాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు రాజారావు, అల్లు తులసీరావు, గొలివి రామకృష్ణ పాల్గొన్నారు.

అధునాతన వ్యవసాయ పద్ధతులు పాటించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: రైతులు అధునాతన వ్యవసాయ పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాఖ కమిషనరేట్ శ్రీకాకుళం జిల్లా పర్యవేక్షకులు, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ డి.ప్రవీణ్ అన్నారు. ధర్మవరం, రామజోగిపేట గ్రామాల్లో బుధవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాలు నిర్వహించారు. పంటలు పరిశీలించి, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలో తెగుళ్ల తీవ్రత బట్టి పురుగు మందు వాడాలని, అనవసరంగా వినియోగం వద్దని సూచించారు. మిత్ర పురుగుల రక్షణ సైతం కీలకంగా వివరించారు. ప్రాథమిక దశలో వేప నూనె పిచికారీ చేస్తే సరిపోతుందన్నారు. ఈ సందర్భంగా రైతులకు వ్యాపనూనెను అందజేశారు కార్యక్రమంలో జేడీ కార్యాలయం ఏడీఏ భవానీశంకర్, ఏడీఏ బగ్గు రజని, వ్యవసాయ అధికారులు సురేష్‌కుమార్, రేవతి, సూర్యకుమార్ ఇందుమతి, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు బగ్గు రాజారావు పాల్గొన్నారు.



ధర్మవరంలో పొలంబడి నిర్వహిస్తున్న దృశ్యం

సంక్షిప్తంగా...

నేడు బాతువలో గృహ సారథులకు శిక్షణ

జి.సిగడాం: బాతువ గ్రామంలో గురువారం ఉదయం 9.30 గంటలకు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని జేసీఎస్ మండల ఇన్‌చార్జి డోల వెంకటరమణ బుధవారం తెలిపారు.

ఈ- క్రాప్ నమోదుపై క్షేత్రస్థాయి పరిశీలన

రణస్థలం: రైతులు సాగు చేస్తున్న పంటలకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి కె. శ్రీధర్ తెలిపారు. రావాడ, క్రిష్టాపురం గ్రామాల్లో ఈ–క్రాప్ నమోదును బుధవారం పరిశీలించారు.

రక్తదాతలే ప్రాణదాతలు

శ్రీకాకుళం అర్బన్: రక్తదాతలు ప్రాణదాతలతో సమానమని ఆర్టీసీ ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ అన్నారు. 34వ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా ఏపీఎస్ఆర్టీసీ శ్రీకాకుళం కాంప్లెక్స్‌లోని డిస్పెన్సరీ కార్యాలయంలో బుధవారం శ్రీకాకుళం 1, 2 డిపోల మేనేజర్లు కె.మాధవ్, కె.ఆర్.ఎస్.శర్మల పర్యవేక్షణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.

నీలగిరి తోట దగ్ధం

ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారాం పురం పంచాయతీ చినరావుపల్లి పరిధిలో మంగళవారం రాత్రి నీలగిరి తోటలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మొక్క దశలో ఉన్న తోట కాలి బూడిదైంది. గ్రామానికి చెందిన పది కుటుంబాలకు చెందిన ఎనిమిది ఎకరాకు నష్టం వాటిల్లింది. ప్రమాదంపై బాధిత రైతులు పొన్నాడ ఆదినారాయణ, శ్రీనివాసరావు, బాలకృష్ణ, జగన్నాథరావు, భీమారావు, పప్పల రమణమ్మ, చిగిలిపల్లి రాధమ్మ అధికారులకు ఫిర్యాదు చేశారు.

పరిశోధనలకు ప్రాధాన్యత

ఎచ్చెర్ల క్యాంపస్: బోధకులు పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విద్యా సంస్థ (ట్రిపుల్ ఐటీ) శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో బుధవారం ఇంగ్లిష్ హెచ్ఓడీ రాకోటి శ్రీనివాసరావు అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీలో ఆంగ్ల సాహిత్యంలో డాక్టరేట్ పూర్తి చేసిన సందర్భంగా అభినందించారు. ట్రిపుల్ ఐటీలో పనిచేస్తున్న ఈయన ప్రొఫెసర్ వి.బి చిత్ర గైడ్‌గా డాక్టరేట్ పూర్తిచేశారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

శ్రీకాకుళం రూరల్: మహాత్మా జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు విశాఖ జిల్లా సింహాచలంలో గతనెల 29, 30, 31 తేదీల్లో జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న టెక్కలి, పలాస, పాతపట్నం, శ్రీకాకుళం, ఆమదాలవలస బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభకనబర్చారు. బాలికల పాఠశాలల నుంచి శ్రీకాకుళం జిల్లా జట్లు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రథమ స్థానంలో, అథ్లెటిక్స్ 800 మీటర్ల పరుగు పందెంలో రెండో స్థానం, 1500 మీటర్ల పరుగులో ప్రథమ స్థానంలో నిలిచినట్టు ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ జిల్లా కన్వీనర్ జల్లు లక్ష్మణమూర్తి బుధవారం తెలిపారు.

కారు ఢీకొని యువతి మృతి

డెంకాడ: మండలంలోని నాతవలస టోల్‌ప్లాజా వద్ద ఆగి ఉన్న మోటార్ సైకిల్‌ను కారు ఢీకొట్టడంతో యువతి ఉప్పాడ లావణ్య (17) అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె తల్లిదండ్రులు మంగమ్మ, రమణ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంపై ఎస్సై మహేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. లావణ్య, తల్లిదండ్రులు విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలంలోని నిమ్మవానిపేటకు బైక్‌పై వస్తూ నాతవలస టోల్‌ప్లాజా వద్ద బైక్ పక్కకు తీసి ఆగారు. ఇంతలో అదేవైపు నుంచి వస్తున్న కారు ముందు వెళ్తున్న లారీని తప్పించి వచ్చి ఆగిఉన్న మోటార్ సైకిల్‌ను ఢీకొట్టడంతో అక్కడే నిలబడిన లావణ్య, తల్లిదండ్రులు రమణ, మంగమ్మలు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వారిని విజయనగరం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ లావణ్య మరణించింది. తల్లిదండ్రులు మంగమ్మ, రమణలు చికిత్స పొందుతున్నారు. విశాఖలోని ఎంవీపీ కాలనీలో ఉంటూ రమణ తాపీపని చేస్తున్నాడు. సొంత గ్రామమైన నిమ్మవానిపేటలో శుభకార్యక్రమానికి వస్తుండగా ప్రమాదం జరిగింది.

పనివేళలు పాటించాలి

ఎచ్చెర్ల: ఉపాధి హామీ పథకం పనులు చేసే వేతనదారులు విధిగా పని వేళలు పాటించాలని ఏపీవో శోభాదేవి అన్నారు. స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ. లక్ష విరాళం



విరాళాన్ని ఈవోకు అందజేస్తున్న దాతలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో అమలౌతున్న నిత్యాన్నదాన పథకానికి స్థానికులైన పి.ఎస్.వి.ఎస్.గోపినాథ్, రమ్య దంపతులు రూ. లక్ష విరాళం ప్రకటించారు. చెక్కును ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్‌కు బుధవారం అందజేశారు.

నియామకపత్రాల అందజేత

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో వలంటీర్లుగా ఎంపికైన వారికి నియామకపత్రాలను అందజేశారు. శ్రీకాకుళం ఎంపీడీవో రఘు, జిల్లా పంచాయతీ రాజ్ అధ్యక్షుడు అంబటి శ్రీను కార్యక్రమంలో పాల్గొన్నారు.

విష్ణు సహస్రనామ పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని నిర్వహించిన అచ్యుతాష్టకం, విష్ణు సహస్రనామ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గుజరాతిపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం మండపంలో బుధవారం నిర్వహించిన పోటీల్లో 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ద్రవ జీవామృతంతో ప్రయోజనాలు



జీవమృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ద్రవ జీవామృతంతో పంటలకు అనేక ప్రయోజనాలు ఉంటాయని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఉద్యోగి లక్ష్మన్నాయుడు అన్నారు. జరజాం పంచాయతీ గొలివివానిపేటలో బుధవారం రైతులకు ద్రవ జీవమృతం తయారీపై శిక్షణ, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. పంటల సేద్యంలో ద్రవ జీవామృతం వినియోగం వల్ల భూసారం పెరుగుతోందన్నారు. రసాయన ఎరువుల వినియోగం పూర్తిగా తగ్గించవచ్చునన్నారు. పంటల యాజమాన్య ఖర్చులు తగ్గుతాయని చెప్పారు. రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రైతుల సందేహాలు నివృత్తి చేశారు.

హెల్మెట్ వినియోగం తప్పనిసరి



ఎచ్చెర్ల క్యాంపస్: ఎన్ఏసీఎల్‌లో హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ పెట్టుకోవాలని జేఆర్‌పురం సీఐ ఆదాం అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా అరిణాం అక్కివలసలోని నాగార్జునా అగ్రికెం పరిశ్రమలో హెల్మెట్ వినియోగంపై ఉద్యోగులు, కార్మికులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనం నడప వద్దని, అతివేగం ప్రమాదానికి కారణమవుతాయన్నారు. ఐఎస్ఐ గుర్తింపు ఉన్న సంస్థ నుంచి కొనుగోలు చేసిన హెల్మెట్‌ను వినియోగించాలన్నారు. ప్రతిఒక్కరు రహదారి నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎస్సై సత్యనారాయణ పాల్గొన్నారు.

భద్రతా నియమాలు పాటించాలి

శ్రీకాకుళం క్రైమ్: వాహనదారులు భద్రతా నియమాలు పాటించాలని శ్రీకాకుళం ట్రాఫిక్ డీఎస్పీ సీహెచ్‌జీవీ ప్రసాదరావు అన్నారు. గత నెల 31న జెడ్పీలో జరిగిన అర్ధవార్షిక సమావేశంలో విశాఖ రేంజి డీఐజీ ఎస్.హరికృష్ణ, జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్న ఆదేశాలపై జిల్లా వ్యాప్తంగా ప్రజలకు, వాహనదారులకు అవగాహనా కార్యక్రమాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శ్రీకాకుళం ట్రాఫిక్ పీఎస్ పరిధిలోని ఏడురోడ్లు, డేఅండ్ నైట్ కూడళ్లలో ట్రాఫిక్ ఎస్సైలు లక్ష్మణరావు, వెంకటేశ్వరరావులు హెల్మెట్ వాడకపోతే జరిగే నష్టాలు, ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అందరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని డీఎస్పీ అన్నారు.



శ్రీకాకుళం క్రైమ్: డేఅండ్‌నైట్ సమీపంలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటేశ్వరరావు

ఇష్టపడి చదవాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయ విద్యను విద్యార్థులు ఇష్టపడి చదవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదరి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. నగరంలోని ఎం.పి.ఆర్. లా కాలేజీ విద్యార్థులకు బుధవారం న్యాయశాస్త్ర విద్యపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.మోషి, అధ్యాపకులు నాయుడు పాల్గొన్నారు.